కథానిక :

# ఆద్యంతాల మధ్య

ముదలి మహేశ్వరరావు

అదృష్టము, ఆనందము, సుఖము, శాంతి కొందరి జీవితాలకు గగనకుసుమాలు. అందని ద్రాక్షపళ్లు, ఎండమావులు. కొందరిని దేవుడూ మనిషి కూడ అన్యాయం చేస్తారు. ఈ కథ విశ్వనాథముతో ఆరంభమయి, లక్ష్మితో సాగి, నారాయణతో ఆగిపోయింది. మొదటవాళ్ళిద్దరివీ ఆశకందని జీవితాలయితే నారాయణ జీవితం ఏమిటో మననే చెప్పమంటున్నారు రచయిత.

విశ్వనాథం నిస్పృహ చెందేరకం కాక పోయినప్పటికీ,తనజీవితం విరిగిన పాలవంటుగా అయి పోయిందన్నది గుర్తించాడు. తనకు అరవైనిండి అరవైఒకటి జరుగుతున్నది ఆరుగురు ఆడపిల్లలు. చిన్నపిల్లలు రోగిష్టివాళ్ళు తనసంపాదన నెలకు నూటయాభై జీవితంలో ఒకరోజు గడుస్తుంటే యుగంలావుంది.

"ఈ ఏడు లక్ష్మికి పెళ్లిచేయకపోతే వురేసుకు చస్తాను" ప్రతీరోజూ ఈమాట వంద సార్లయినా అంటుంది విశ్వనాథం భార్య

నిట్టూర్చడం తప్పించి ఏం చేయలేక పోయాడు విశ్వనాథం. అతడూ శాయశక్తుల ప్రయత్నిస్తూనే వున్నాడు. బంట్రోతు హోదావాళ్ళూ కట్నాలు కావాలంటున్నారు. ఇంతవరకూ అప్పులుచేయడం కొంత తగ్గించగలిగాడు కానీ, చిల్లిగవ్వ ఆదాచేయలేక పోయాడు.

అతనికి తల్లిదండ్రులు బతుకుతెరువు ఇంకేమీ ఇవ్వలేక పోయారు. అతణ్ణి భూమ్మీద పడేసి తల్లి వెళ్ళిపోయింది. ఆవెంటనే అతని తండ్రిని డబుల్ న్యూమోనియా తీసుకుపోయింది. ఆతరువాత అతని మేనమామ ఎలాగో, ఓ లాగ అతణ్ణి పెంచుకుంటూవచ్చి "ఎస్సెల్సీ" పాస్ చేయించి, టీచర్ గిరికి ట్రెయినింగు ఇప్పించి ఆఖరికి తనఆఖరి కూతుర్నిచ్చి పెళ్ళి చేసి ఆ తరువాత తనూ వెళ్ళిపోయాడు.

ఆ తరువాత జీవితం? కాబూలీవాళ్ళ సంఘమంతా విశ్వనాథాన్ని వెలివేసింది. సహకార బ్యాంకువాళ్ళు అమలు కాయితాలు పట్టుకొని అతణ్ణి వెంట తరుముతున్నారు. తోడిటీచర్లు అతణ్ణి పలకరించడానికి భయపడతారు. అతను తమనుపలకరిస్తే జడుసుకుంటారు. అతనికి ఆవిధంగా అప్పెక్కడా పుట్టడంలేదు రెండునెలల కొకసారి అతను ఇల్లు మార్చవలసి వస్తోంది. నెలకోసారి అరువుకోసం కిరాణాకొట్టు ఛేంజి చెయ్యవలసి వస్తోంది.

అతని పెద్దకూతురికి చిన్నప్పట్నించీ, అందరి పిల్లలకిలాగే, ఆటలూ, పాటలూ, వీధుల్లో సంబరాలూ అంటే ఎంతో ఇష్టం. ఆపిల్లకి తెలివితేటలు చురుకుదనం కూడావుండేవి. దానికితోడు కాస్త అందంగా కూడా వుండేది. విశ్వనాథానికి ఈపిల్ల ఏదైనా వుద్యోగంచేస్తే ఆదుకుంటుందని ఆశ. కాని, ఆపిల్లకి ఇంటిమీద మమత కలగడానికి ఏ అవకాశమూలేక పోయింది. ఇల్లు నరకంలా అగుపించేది తండ్రి ఎలానూ తనకి పెళ్ళి చేయలేడు. అంచేత తనదారి తనే చూసుకుంది.

పెద్దమ్మాయి చేసిన పరువుతక్కువ పనికి ఆక్రోశించడానికి కన్నీళ్ళు కూడా కరువయ్యాయి ఆశల జీవితాలకి నిత్య జీవితాలకి ఎంతలేడావో తెలిసొచ్చింది. కాని విశ్వనాథానికి ఓమూల భవిష్యత్తు వుజ్వలంగా వున్నట్టు అగుపించేది.

రెండో అమ్మాయి లక్ష్మి నెమ్మదస్తురాలు. ఇంట్లో పనులంతా గుట్టుగా చేసినట్లు, తనూ గుట్టుగానే వుండేది. అయితే పెద్దదానిలాగ తెల్లగా వుండదు సరికదా, బొత్తిగా అనాకారి తనంవల్లే మెట్రిక్ పాసయి పదిహేన్నేళ్ళయినా వుద్యోగంరాలేదు. పెళ్ళికాలేదు.

యవ్వనపు తొలిరోజుల్లో లక్ష్మికూడా బంగారు కలలుకాక పోయినా, తీపికలలు మాత్రం వస్తుండేవి. కుటుంబ పరిస్థితులు పైగా తన అనాకారిత్వం కారుమేఘాల్లాగ ఆకలల్ని కప్పేసాయి ఇరవైఏళ్ళు దాటిం తర్వాత ఒకరకంగా వేదాంత తత్వంలో పడినా క్రమంగా ఒక్కో సంవత్సరం దాటుతుంటగా ఆవేదన బయల్దేరింది. తనని పెళ్ళి చేసుకోనేవాడు, ప్రేమించే వాడుకోసం నిరీక్షించసాగింది జీవితంలో కనీసం ఏకొద్దిపాటి మధురత్వం దొరికినా చాలని తహ తహ లాడింది. కాని...

ఇదంతా లక్ష్మి జీవితానికి ఉపోద్ఘాతం లాంటిది.

ఒకసారి విశ్వనాథం ఇంటిప్రక్కనే ఓ చిత్రకారుడు దిగాడు. ఆ గదిచాలా కాలంగా వాసయోగ్యం కానందువల్ల ఖాళీగానే వుండి పోయింది. ఈనాటికి ఇతగాడు దిగాడు, విశ్వనాథం కుటుంబం అంతా అతణ్ణి పరీక్షగా చూశారు లక్ష్మిమరీని.

(తరువాయి 19 వ పేజీ)

# ★ ఆద్యంతాల మధ్య ★

(10 వ పేజి తరువాయి)

నారాయణకి చిన్నతనం నుంచీ చిత్రరచనంటే ఆసక్తి. కాగా ఇంకేపనీ దొరకనందువల్ల, చేతకానందువల్ల చిత్రలేఖనంలోకి దిగాడు. పైగా చిత్రరచనంటే తపన హెచ్చు. అతడికి నచ్చేవన్నీ విదేశీచిత్రాలే. చిత్రరచనలో అతడు సృష్టించుకొనే పరిస్థితులు మహా దారుణంగా, అసహ్యంగా వుంటాయి. అలా అయితేకాని అతను చిత్రాలు గీయలేడు. ఎప్పుడూ ఏదో అగ్ని అతడి హృదయంలో మండుతూ వుండాలి. అయితే ఏ ఒక్కరూ అతని చిత్రాల్ని ప్రశంసించలేదు సరికదా, ఏవగించుకున్నారు.

ఏదైనా చిత్రం ప్రారంభించి ముగించకుండా అలానే వదిలేసేవాడు. సిగరెట్లు తాగుతూ ఒకటే ఆలోచన. లక్ష్మి దృష్టి మాత్రం వీలున్నప్పుడల్లా అటువేపే వుండేది.

ఒక్కసారి ఏం తోచిందో ఏమో మిట్ట మధ్యాహ్నం ఎండలో బయలుద్దేరాడు నారాయణ. మైలున్నర దూరంలో ఓతోటవుంది, అక్కడికి చేరాడు. ఓరాయిమీద కూచొని ఆలోచించడం మొదలుపెట్టాడు.

కొంతసేపటికి తన వెనుకగా ఎవరో వున్నట్టు తోచింది. తిరిగిచూస్తే లక్ష్మి. ఎంతసేపుగనో అలానేనిల్చొని నారాయణవేపు, అతడి కళ్ళవేపుచూస్తూ వుండిపోయింది అంత ఎండలోనూ.

నారాయణ లక్ష్మి తనవేపు అలాచూడటం అంతకుముందే గమనించాడు. ఇంతలో లక్ష్మి తూలి పడిపోబోయింది. నారాయణ పట్టుకున్నాడు. మెల్లగా కళ్ళువిప్పింది అతని ఒడిలో.

"నాపేరు నారాయణ. మీయింటిప్రక్కనే వుంటున్నా. అయినా మీకు తెలుసే అనుకుంటా" అన్నాడు.

వినీ వినిపించనట్లుగా "అవును" అంది.

"మళ్ళీ నాపేరు లక్ష్మి" మెల్లగానే అంది.

నారాయణ లక్ష్మి ముఖంవేపు చూశాడు. కళ్ళుమూతలు పడ్డాయి. ఆకళ్ళకింద నల్లటి రింగులున్నాయి.

కాని లక్ష్మిగుండె మాత్రం విపరీతంగా కొట్టుకొంటూంది శరీరంనిండా ఉద్రేకం వుంది. నారాయణకి ఏంతోచలేదు. మెల్లగా తనఒడిలోవున్న లక్ష్మితలను క్రిందకు దించి, దూరంగావున్న ఓగోతిలోని నీళ్ళు తెచ్చి మొహంమీద చల్లాడు.

ఈసారి లక్ష్మి కళ్ళుతెరచి ఎదురుగావున్న నారాయణవేపు చూసింది. ఆమెఏదో అర్థం చేసుకోడానికి ప్రయత్నించింది. అంతలోనే కళ్ళవెంబడి నీళ్ళువచ్చాయి.

"ఈ కాస్సేపూ మీఒడిలో విశ్రమించలేనంత అసహ్యంగా వున్నానా?" అడిగింది.

నారాయణకి ఆమెబాధ అర్థమయింది.

"లేదు, లేదు. స్పృహతప్పి పడిపోతే నీళ్ళకోసం అనివెళ్ళా, మీరు చాలా బలహీనంగా వున్నారు. అందుకనే భయంవేసింది" అన్నాడు. నిర్లక్ష్యంగా, నీరసంగా నవ్వబోయింది, లక్ష్మి.

"చస్తేనేమంచిది. ప్రతిరోజూ నిద్రలేవడంతోటు అనుకుంటూ వుంటా — ఈ రోజు కూడా జీవితం మార్చలేకపోతే చద్దామని. కాని చావు రాకుంటోంది. చివరకి మీరు వచ్చారు."

నారాయణ లక్ష్మిని పరీక్షగా చూస్తూ నిలబడ్డాడు. అస్థిపంజరానికి, నల్లటిరంగు వేసి తలకు ఇన్ని వెంట్రుకలు తగిలించి నట్టుగ పడివుంది లక్ష్మి.

ఇంకా చెప్పుకుపోతోంది— "ఒక్క ఆదరమైన, ప్రేమచూపు కోసం తపించుకుపోయేను. ఇలా వీధిలోకి వెళ్లేసరికల్లా ఇంట్లోంచి కేకలూ, తిట్లూ. ఎప్పుడైనా పొరపాటున ఎవరివేపు చూసినా అంత అసహ్యంగా చూచి చటుక్కున తలతిప్పుకునేవారు. ధనం — అందం లేని నేను ఎవ్వరినీ ఆకర్షించలేక పోయా. తల్లిదండ్రులకూడా నానుంచి బాధే, అలాంటి ఆశలకందని నా జీవితంలో మీరు ప్రవేశించారు. నన్ను ఆదరించక పోయినా అసహ్యించుకోలేదు. ఇదేనా జీవితంలో ఆఖరి ప్రయత్నం. మీనుండి ఈ మాత్రం తృప్తి, ఆనందం లభించకపోతే ఈసారి నిజంగానే చచ్చి పోవలిచా."

లక్ష్మి ఏడుస్తోంది. కన్నీటి మరకలు గడ్డం దాకా వ్యాపించాయి. జాలిగా అతడివేపే చూస్తుంది.

నారాయణ లాలనగా ఆమెతల నిమిరాడు. లక్ష్మి ఆచేతిపై తలవుంచి, అలా అతని గుండె దగ్గరకి జరిగిపోయి, అతనిలో యిమిడిపోయింది— "నన్ను విడిచిపెట్టకండి. నన్ను ప్రేమించకపోయినా, నన్ను ప్రేమించనివ్వండి" అంటూ.

మరునాడు ఏదో చిత్రం గీస్తుండగా లక్ష్మి వచ్చింది. ఎంతో పరిచయస్థుల్లా ఒకరిని చూసి ఒకరు నవ్వుకున్నారు నారాయణ లక్ష్మి భుజంమీద చెయ్యివేసి దగ్గరకు తీసుకున్నాడు.

తర్వాతలక్ష్మికి తనుగీసిన చిత్రాల్ని చూపించాడు. "ఎలావున్నాయి?" అడిగాడు.

లక్ష్మి చిత్రాలువేపు అసలు చూడనేలేదు. అతణ్నే చూస్తువుంది. కానీ "బావున్నాయి" అంది.

ఇంతలో పక్కనుంచి తల్లికేక వినిపించింది. కాని లక్ష్మి వినిపించుకోలా, భవిష్యత్తు గురించి ఆలోచనలోపడ్డది.

"మరిమీకు డబ్బో" అడిగింది.

"నాస్నేహితుడు ఒకడున్నాడులే. ఒక్కడంటే ఒక్కడే. అతడే నాకు నెల నెలా పంపుతుంటాడు."

ఈసారి లక్ష్మి తల్లే అక్కడికి వచ్చింది. కూతుర్ని, నారాయణ్ని ఓసారి ఆశ్చర్యంగా చూసి కూతుర్ని వెంటేసుకు వచ్చేసింది.

ఆరోజు రాత్రి విశ్వనాథం ఇంట్లో పెద్ద అలజడి రేగింది. విశ్వనాథం పెద్ద పెద్ద కేకలు వేశాడు.

"ఆవెధవెవడో మనకంటే దరిద్రుడు, పైగా వాళ్ళూ వీళ్ళూ పిచ్చాడంటారు. ఎంతయినా, కుర్రదాన్ని వాడిచేతుల్లో పెట్టలేదు."

కానీ విశ్వనాథం భార్యకుమాత్రం కొంచెం సంతోషంగానే వుంది. మొగుడెలా పిల్లను పెళ్ళిచెయ్యలేడు ఈజన్మలో. దాని అదృష్టమా అంటూ ఎటువంటి వాడో ఓవరుడంటూ దొరికాడు. లక్ష్మి ఏమీ మాట్లాడలేదు. తలంచుకొని తిన్నగపోయి, చెల్లెల్లు పడుకున్న చోటుకుపోయింది.

తర్వాత ఆ దంపతులు ఎన్నో విధాలుగ ఆలోచించుకున్నారు. తేదా పాడులాడుకున్నారు. చివరకు లక్ష్మిని నారాయణకిచ్చి పెళ్లి చెయ్యడానికి నిశ్చయించుకున్నారు.

♦ ♦

నారాయణ మనస్సులో అప్పుడు ఏది మెదులుతుందో సరిగ్గా చెప్పటం కష్టం. అతడికి లక్ష్మి విషయం అంత ముఖ్యంగా తోచలేదు. అంతకుముందు అతని జీవితంలో ప్రవేశించి, నిష్క్రమించిన ఆడవాళ్ళ గురించి తీవ్రంగా ఎప్పుడూ ఆలోచించలేదు. ఎంచేతంటే వాళ్ళంతా వ్యభిచారిణులు. పైగా తనకి వచ్చిన అదృష్టం ఇక జన్మలోరాదు.

అతని స్నేహితుడు బాబు వ్రాశాడు— అతనికి చిత్రపోటీలో ఏదో బహుమతి వచ్చిందనీ, నారాయణ వెంటనే అక్కడికి వచ్చేస్తే, ఓ సంస్థ అతడిని వుద్యోగంలోకి తీసుకుంటుందని అన్నాడు.

నిజంగా తన చిత్రానికి మొదటి బహుమతి అనగానే నారాయణ పొంగిపోయాడు. తిన్నగా ఆ వూరు వదిలి స్నేహితుడి దగ్గరకు బయల్దేరాడు

అయితే బహుమతి మొత్తం అతడికి అందలేదు. మధ్యలోనే హరించుకుపోయింది. కనీసం పేరుకూడా కొద్దిరోజులవరకే వుంది. అంతా అతణ్ని మరచేపోయారు. అతడూ మరిచిపోయాడు లక్ష్మినిన్నీ తన చిత్రానికి వచ్చిన బహుమతినీని.

ఈకథ ఇలా విశ్వనాథంతో ప్రారంభమయి లక్ష్మితోసాగి, నారాయణతో ఆగిపోయింది. మొదటి వాళ్ళిద్దరివీ ఆశకందని జీవితాలయితే, నారాయణ జీవితం ఏమిటో మీరే చెప్పాలి.

---

## మేముమటుకు కాదన్నామా ?

"తెల్లవెంట్రుకలను పూర్తిగానిర్మూలించును" అని విపరీతముగా ప్రకటింపబడుతున్న ఓమందును ఓఖామందువాడాడు, తెల్లారేటప్పటికి వెంట్రుకలన్నీ వూడిపోయాయి.

ఖామందుగారు మండిపడుతూ ఆ మందులమ్మేవాడి పీకనులిమి వేయడానికి వెళ్లాడు. "అయ్యా మేముచెప్పింది నిజమే, తెల్ల వెంట్రుకలను పూర్తిగా నిర్మూలించునన్నామేకాని నల్లవెంట్రుకను మొలిపించును అనలేదే!" అన్నాడా గడసరి.

---


# శుభవార్త

డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానము లేనివారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్సవల్ల దేహములోవున్న వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును.

వివరములు కోరువారు పోస్టుఖర్చులకు ఒకరూపాయి పంపవలయును

అడ్రసు:

శ్రీ యోగాశ్రమము
P. O. పెదవాల్తేరు
విశాఖపట్టణము — 3


## వివేకానందవాణి :

ఈశ్వరుడుని సేవించదలచుకున్నవారు - ఆయనబిడ్డలను - ఈ ప్రపంచంలోని సృష్టినంతా సేవించవలసివున్నది. భగవంతుని సేవకులను సేవించేవారు భగవంతుని సేవకులలో అగ్రగణ్యులని శాస్త్రాలలో పేర్కొనబడ్డారు. మనిషికి పరిశుద్ధత, నిస్వార్థపరత ఎంతఎక్కువగావుంటే, అంతఆధ్యాత్మికుడై ఈశ్వరునికి అంతచేరువవుతాడు. అన్నిదేవాలయాలు పుణ్యక్షేత్రాలు దర్శించినప్పటికీ, స్వార్థపరుడయి చిరుతపులిలా విభూతిపూసుకున్నా, ఈశ్వరునికి దూరంగానే వుండి పోతాడు.